క్లుప్తంగా

రీ సర్వేను రద్దు చేయాలి



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

మధురపూడి: కోరుకొండ మండలం నర్సాపురంలో శనివారం రీ సర్వే కార్యక్రమాన్ని రద్దు చేయాలని రైతులు కోరారు, రీ సర్వేకు ముందున్న రికార్డుల ఆధారంగానే కొనసాగించాలని, రికార్డు పరంగా అభ్యంతరకరంగా ఉందని, పాతసర్వే నెంబర్లతో ఉన్న రికార్డునే ఉపయోగించాలని ఉన్నతాధికారులను కోరారు. ఈ వినతిపత్రాన్ని జిల్లా సర్వేయర్ రజనీకి అందజేశారు. కార్యక్రమంలో నర్సాపురం ఎంపీటీసీ పీతా శ్రీనిబాబు, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



కాపవరంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవికుమార్

బిక్కవోలు: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్సై వాసంశెట్టి రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని కాపవరం, బలభద్రపురం గ్రామాల్లో మహిళలకు దీనిపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైతే ఏ విధంగా ఫిర్యాదు చేయాలనే విషయాలపై ప్రజలకు వివరించారు. అపరిచితుల లింకులు, మేసెజ్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. గ్రామస్తులు ఆపదలో ఉన్న ఎడల 112 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. వాట్సాప్ సందేశాన్ని సైతం పంపవచ్చన్నారు.

ఘనంగా సహస్ర జ్యోతిర్లింగార్చన



విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద జ్యోతులు వెలిగిస్తున్న మహిళలు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం ఘనంగా సహస్ర జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. అర్చకులు గరిమెళ్ల ప్రకాశరావు ఆధ్వర్యంలోని 12 మంది రుత్వికులతో లక్ష బిల్వార్చన నిర్వహించారు. మహిళలు విశేషంగా పాల్గొని శివలింగ ఆకారంలో ఉన్న జ్యోతులను వెలిగించారు. అనంతరం ఆలయం కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేపట్టారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బిక్కవోలు: గ్రంథాలయోద్యమంలో అయ్యంకి వెంకట రమణయ్య, రంగనాథన్, పాతూరి సేవలు చిరస్మరణీయమని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడోరోజు విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్, వ్యాస రచన, వ్యక్తత్వ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ పౌరులుగా తయారు కావాలని సూచించారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారి ఎస్ బాల తదితరులు పాల్గొన్నారు.

21న గాయత్రీ హోమం

రాజానగరం: కార్తిక మాసం సందర్భంగా స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద ఈ నెల 21 (గురువారం)న గాయత్రీ హోమం, కార్తిక అన్న సమారాధన జరగుతాయి. అమలాపురంలోని పూజ్యనీయులు రామానందస్వామి శిష్యపరివారం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి గాయత్రీ హోమాన్ని నిర్వహిస్తారు. హోమం చేయించుకునే భక్తులకు అవసరమైన హోమ ద్రవ్యాలను ఆలయ కమిటీ ఉచితంగా అందజేస్తుంది. అలాగే 11 గంటల నుంచి ఆలయం పక్కనే ఉన్న మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో కార్తిక అన్నసమారాధన జరుగుతుంది. ఈ కార్యక్రమాలకు భక్తలు తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువై యున్న పద్మావతీ అలమేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రాధాన్యం ఎవ్వరికో..

- గత టీడీపీ ప్రభుత్వంలో అనేక నిబంధనలు
- ధాన్యం విక్రయించాలంటే భయపడిన రైతులు
- ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలపై అనాసక్తి
- ప్రైవేటు వ్యాపారులకే అమ్మకాలు
- ఇప్పుడు ఎటువైపు మొగ్గు చూపుతారో!



రఘుదేవపురంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

సీతానగరం: నియోజకవర్గంలో ఖరీఫ్ వరి కోతలు జోరుగా జరుగుతున్నాయి. ఎక్కువ మంది రైతులు మెషీన్లతో కోత కోయించారు. అలా వచ్చిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా రహదారుల పక్కన ఆరబెట్టిన ధాన్యం కనిపిస్తోంది. గత ప్రభుత్వాల మాదిరిగానే ఈసారి కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. అయితే రైతులు వాటికి ప్రాధాన్యం ఇస్తారా, లేకపోతే ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తారా అనే సందేహం కలుగుతోంది. ఎందుకంటే 2014 నుంచి 2019 వరకూ టీడీపీ ప్రభుత్వం హయాంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులు ఆసక్తి చూపేవారు కాదు.

అప్పట్లో కష్టాలే..

గత టీడీపీ ప్రభుత్వం హయాంలోనూ (2014 నుంచి 2019) నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ వాటిలో రైతులు ధాన్యాన్ని విక్రయించేవారు కాదు. ప్రభుత్వం నిబంధనలు వారికి అడ్డంకిగా ఉండేవి. సరైన మద్దతు ధర ఇచ్చేవారు కాదు. అలాగే ధాన్యంలో తేమ ఉందని, రాళ్లు ఉన్నాయంటూ కోత విధించేవారు. ధాన్యం డబ్బులను కూడా చాలా ఆలస్యంగా జమ చేసేవారు. వీటితో విసిగిపోయిన రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించడానికి ఆసక్తి చూపేవారు. అలాగే నకిలీ విత్తనాలు, పురుగు మందులతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. ఎరువుల కొరతతో పంటలకు సమయానికి ఎరువు అందేది కాదు.

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు అన్ని విధాలా మంచి జరిగింది. 2019 నుంచి 2024 వరకూ రైతు రాజ్యం నడిచింది. విత్తు నుంచి విక్రయం వరకూ అన్ని సందర్భాల్లోనూ జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. దళారులు లేకుండా ప్రభుత్వమే రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. రైతుల బ్యాంకు ఖాతాల్లో ఎప్పటికప్పుడు నగదును జమ చేసేది. తుపాను కారణంగా కురిసిన వర్షాలకు తడిసిపోయిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి, మద్దతు ధర అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే అని చెప్పవచ్చు. అన్నదాతలకు సాయం చేయడానికి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆర్బీకేల ద్వారా ఎరువుల అమ్మకాలు జరిపింది. నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులను అందుబాటులోకి తెచ్చింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మంచి మేలు చేసింది.

ప్రైవేటుకే రైతుల మొగ్గు

ప్రస్తుతం సాంబామసూరి వంటి సన్నాల రకాలను మద్దతు ధర కంటే రూ.400 తక్కువకే ప్రైవేటు వ్యాపారులకు రైతులు విక్రయిస్తున్నారు. వీటిని ధాన్యం కేంద్రాల్లో కొనుగోలు చేయరు. పీఎల్ఏ 1100, ఎంటీయూ 1318 రకాలను మాత్రమే కొనుగోలు చేస్తారు. రాజానగరం మండలంలో 3 వేలు, కోరుకొండ మండలంలో 2,500, సీతానగరం మండలంలో 3 వేల ఎకరాల్లో వరిని సాగు చేశారు. ప్రస్తుతం కోతలు కోసి, ధాన్యాన్ని సిద్ధం చేస్తున్నారు. కొందరు రైతులు చేతికి వచ్చిన పీఎల్ రకాన్ని ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఆరబెట్టని 75 కిలోల ధాన్యాన్ని రూ.1,300 అమ్మకాలు జరుపుతున్నారు. ఎంటీయూ 1318, పీఎల్ఏ 100 రకం ధాన్యం 100 కిలోలకు రూ.2,300, అలాగే 75 కిలోలకు రూ.1,725 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. సీతానగరం మండలంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే రైతులు తమ ధాన్యాన్ని ఎవరికి విక్రయిస్తారనే దానిపై స్పష్టత లేదు. కొనుగోలు కేంద్రాలపై రైతులకు ఆసక్తి లేదు

నిబంధనలతో ఇబ్బంది



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ రైతులు ఆసక్తి చూపేవారు కాదు. ఎందుకంటే అక్కడ అనేక నిబంధనలు అడ్డంకిగా ఉండేవి. తేమ ఎక్కువగా ఉందని, రాళ్లు ఉన్నాయని వెనక్కి పంపేవారు. దీంతో రైతులు విసిగిపోయి ప్రైవేటు వ్యాపారులకు అమ్మకాలు జరిపేవారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయాలు చేయడానికి రైతులు బారులు తీరేవారు.

– కోసూరి నాగరాజు, రైతు, చినకొండేపూడి

తేమ 17 శాతానికి మించి ఉండరాదు



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యంలో తేమ 17 శాతానికి మించి ఉండకూడదు. సీతానగరం మండలంలో 11 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇక్కడ ధాన్యం విక్రయించిన రైతులకు సొమ్ములను వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తారు. అయితే రైతులు కేంద్రాల వద్దే అమ్మాలనే నియమం లేదు. వారికి ఇష్టమైతే ప్రైవేటు వ్యాపారులకు విక్రయించుకోవచ్చు.

– కె.సూర్య రమేష్, ఏవో, సీతానగరం

డిమాండ్ల పరిష్కారానికి వినతి



వడిశలేరులో సర్పంచ్ కొల్లాటి శ్యామలావతికి వినతిపత్రం అందిస్తున్న 104 సిబ్బంది

రంగంపేట: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రంగంపేట 104 సిబ్బంది ప్రజాప్రతినిధులకు శనివారం వినతి పత్రాలు అందించారు. మండలంలోని వడిశలేరు, సింగంపల్లి గ్రామ సర్పంచ్‌లు కొల్లాటి శ్యామలావతి, తుట్టా శివశంకర ఆనంద్‌లకు వినతిపత్రాలు అందించిన అనంతరం ఉద్యోగులు మాట్లాడుతూ.. తమకి మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, కుటుంబాలను పోషించడం కష్టం మారిందని వాపోయారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ సొమ్ము తిరిగి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో 104 సిబ్బంది గొర్రెల కాంతారావు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు బత్తిన అనిల్‌కుమార్, గొల్లవిల్లి మోహన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అపార్ నమోదును వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ-1 సత్యనారాయణ

పెదపూడి: ప్రతి విద్యార్థికి ఒకే యూనిక్ నంబర్ ఆధార్ ఉండటం వల్ల భవిష్యత్తులో అనేక లాభాలు ఉంటాయని అపార్ నమోదును త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓ-1 సత్యనారాయణ సూచించారు. పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అపార్ నమోదులో చిన్న చిన్న ప్రతిబంధకాలు ఎదరవుతున్నాయన్నారు. ఇలాంటి సమస్యలు అధిగమించడానికి జి.మామిడాడలో అధార్ సెంటర్ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, ఈఓపీఆర్డీ నరేంద్రరరెడ్డి, ఎంఈఓ-2 సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు సుబ్రహ్మణ్యేశ్వరుని షష్ఠి రాటముహూర్తం

బిక్కవోలు: రాష్ట్రవ్యాప్తంగా భక్తజనం తరలివచ్చే బిక్కవోలు షష్ఠి ఉత్సవాలకు రాట మంచి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లె వాసు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం: ప్రభుత్వ సహకారంతో చేపట్టిన పేదల ఇళ్ల నిర్మాణాలను డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తయ్యేలా పనిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు ఆదేశించారు. ఈ లక్ష్యంలో ఇప్పటి 13 శాతం మాత్రమే పూర్తి అయిందని, మిగిలిన లక్షాన్ని సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజమహేంద్రవరంలోని పేదలకు వెలుగుబందలో గత ప్రభుత్వం పంపిణీ చేసిన స్థలాలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 3,396 ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా, 683 మాత్రమే పూర్తయ్యాయన్నారు. వివిధ దశలలో ఉన్న మిగిలిన నిర్మాణాలను వేగవంతం చేసి, లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. లబ్ధిదారులను గ్రూపులుగా ఏర్పాటు చేసి, వారి సమస్యలను తెలుసుకుని, వాటికి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. అలాగే వారితో వాట్సాప్ గ్రూప్‌లను కూడా ఏర్పాటు చేయించి, నిరంతరం పనుల ప్రగతిని సమీక్షించాలని సూచించారు. సమష్టిగా కృషి చేస్తేనే నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తవుతాయన్నారు. ఆమె వెంట గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి ప్రాజెక్టు మేనేజర్ కేఎల్ శివజ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ బీవీ గిరి, తహసీల్దార్ లక్ష్మీలావణ్య, ఎంపీడీఓ జేఏ ఝాన్సీ తదితరులు ఉన్నారు.

వంగలపూడిలో నిలిచిన ఇసుక తవ్వకాలు



వంగలపూడి రీచ్‌లో నిరసన తెలుపుతున్న ట్రాక్టర్ డ్రైవర్లు

సీతానగరం: ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు నిరసనతో వంగలపూడి ఇసుక ర్యాంపులో శనివారం తవ్వకాలు నిలిచిపోయాయి. రోజూ మాదిరిగానే శనివారం ఉదయం 6 గంటలకు గోదావరి పరివాహక ప్రాంతం నుంచి స్టాక్ పాయింట్ వద్దకు ఇసుకను చేర్చడానికి ట్రాక్టర్లపై ఇసుకను కూలీలు ఎగుమతి చేశారు. అయితే ర్యాంపు నిర్వాహకులు చెల్లించే నగదు గిట్టుబాటు అవ్వడం లేదంటూ ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంతం నుంచి స్టాక్ పాయింట్ వరకు ట్రాక్టర్‌కు రూ.150, కూలీలకు రూ.200ను ర్యాంపు నిర్వాహకులు చెల్లిస్తున్నారన్నారు. అయితే ట్రాక్టర్‌కు ఆ ధర గిట్టుబాటు కావడం లేదన్నారు. ట్రాక్టర్‌కు రూ.250, కూలీలకు రూ.250 చొప్పున ర్యాంపు నిర్వాహకులు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనతో ర్యాంపు వద్ద ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. స్టాక్ పాయింట్ వద్ద ఉన్న ఇసుకను పొక్లెయిన్‌తో లారీలపై ఎగుమతి చేశారు. ఆ ఇసుక కూడా ఉదయం 9 గంటలకు ఖాళీ అవ్వడంతో అధిక సంఖ్యలో లారీలు నిలిచిపోయాయి. అయితే ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు, కూలీలతో ర్యాంపు నిర్వాహకులు ఎటువంటి చర్చలు జరపలేదు. దీనితో శనివారం పూర్తిగా ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి.

సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి



అనపర్తిలో బ్యాంక్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుమంత్

పెదపూడి: బ్యాంకుల్లో వినియోగదారుల ఖాతాలో ఉన్న నగదు రక్షణకు బ్యాంక్ అధికారులు, పోలీసులు కృషి చేస్తున్నట్లు అనపర్తి సీఐ సుమంత్ అన్నారు. మండల కేంద్రమైన అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లోని బ్యాంక్ మేనేజర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలకు చెక్ పెట్టడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల వినియోగదారులు ఇతరులకు ఓటీపీలు చెప్పడం, ఆన్‌లైన్ లింక్‌లు ఓపెన్ చేయడం మొదలైన కారణాలతో వారి ఖాతాల నుంచి నగదు చోరీకి గురవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ అమల్లోనూ రాజకీయమేనా..



కాపవరం ప్రారంభంలో టీడీపీ నాయకుల ఫ్లెక్సీ



అదే ప్రాంతంలో వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ మూసివేత

మధురపూడి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల నిబంధనలను అధికారులు వంద శాతం అమలు పర్చాలి. కానీ కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కోరుకొండ మండలం కాపవరం ప్రధాన రహదారిలో ఫ్లెక్సీలు దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. కాపవరం గ్రామ ప్రారంభంలో రెండు ఫ్లెక్సీలు ఉన్నాయి. దీనిలో ఒకదాన్ని కూటమి నాయకులు, రెండో దాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వాటిని తొలగించాలి, లేదా మూసివేయాలి. అయితే వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీని మూసివేసిన అధికారులు.. టీడీపీ ఫ్లెక్సీని మాత్రం వదిలేశారు. దోసకాయలపల్లిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని, వైఎస్సార్ సీపీ నాయకులకు చెందిన ఫ్లెక్సీలకు ముసుగు వేశారు. అయితే టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను మాతరం రెండు రోజుల తర్వాత ముసుగు వేశారు.

ఫార్మసీ జాతీయ సదస్సులో సత్తా



కేర్ మేస్ట్రో అవార్డును అందుకుంటున్న డాక్టర్ నాగేంద్ర

రాజానగరం: సూరంపాలెంలోని ఆదిత్య కళాశాలలో 'కంప్యూటేషనల్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ ఫార్మా స్యూటికల్ ఎక్సిలెన్స్' (కేర్ 2024) అనే అంశంపై శుక్ర, శనివారాలలో శనివారం జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఫార్మసీ రంగంలోని అంశాలపై నిర్వహించిన పోటీలలో వీజేఎస్ ఫార్మసీ కళాశాల సత్తా చాటింది. పోస్టర్ ప్రజెంటేషన్, ఓరల్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ చూపింది. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నాగేంద్ర కేర్‌మేస్ట్రో అవార్డు పొందారు. అధ్యాపకురాలు కేవీ నాగలక్ష్మి ఓరల్ ప్రజెంటేషన్‌లో ప్రథమ బహుమతి సాధించారు. విద్యార్థుల పోస్టర్ ప్రజెంటేషన్స్‌లో ఎం.పుష్పలత, జి.అమూల్య ప్రథమ, ఎండీ రవూఫ్ తృతీయ, ఎస్.మేఘనకు కన్సోలేషన్ బహుమతులు లభించాయి. లఘు చిత్రప్రదర్శనలో జి.దుర్గాప్రసాద్ తృతీయ బహుమతిని అందుకున్నాడు. ఈ సందర్భంగా విజేతలను కరస్పాండెంట్ జగన్మోహన్‌రెడ్డి అభినందించారు.

క్రీడల్లో పాలమూరు జెడ్పీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

పెదపూడి: అనపర్తి మండలం పాలమూరులో సత్తి వీరరాఘవరెడ్డి, లక్ష్మీనరసయ్యమ్మ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం ఆర్.వి జయదర్గ తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి అండర్-17 పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు వానపల్లి అనంత వెంకట శ్రీరామ్, మేడపాటి సంకీర్తనదేవి, కర్రి ధనుష్‌రెడ్డి, గుడాల వెంకట్‌లోకేశ్వర్ ఉత్తమ ప్రదర్శనతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ అండర్-14 విభాగంలో పెంకే వీరవెంకట సత్యనారాయణ ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులను, పీడీ ప్రభాకర్‌రెడ్డిని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఉద్యమకారుల సేవలు ఆదర్శనీయం



సీతానగరం గ్రంథాలయంలో ఉద్యమకారులకు పుష్పాంజలి ఘటిస్తున్న ప్రముఖులు



రాజానగరం గ్రంథాలయంలో..

రాజానగరం: గ్రంథాలయ వ్యవస్థ అభివృద్ధికి ఉద్యమకారులు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని గైట్ ఇంజినీరింగ్ కళాశాల లైబ్రేరియన్ సీహెచ్ బాలకృష్ణ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఉద్యమ కారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బాలకృష్ణ మాట్లాడుతూ పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, ఎస్ఆర్ రంగనాథ్, సూరి వెంకటశాస్త్రి, తదితరులు గ్రంథాలయ ఉద్యమంలో చేసిన త్యాగాలను గుర్తు చేశారు. లైబ్రేరియన్ కె.సత్యనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం గ్రంథాలయంలో లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రంథాలయ ఉద్యమ కారుల సేవలను వివరించారు. ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయుడు కస్సూరి సతీష్‌బాబు, విశ్రాంత ఉపాధ్యాయుడు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు డాక్టర్ సత్యం రమేష్ బాబు పాల్గొన్నారు.

ముగిసిన ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ ప్రోగ్రామ్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రముఖులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జరిగిన ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ ప్రోగ్రామ్ శనివారంతో ముగిసింది. నాంది ఫౌండేషన్, మహీంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ ప్రాజెక్టు సహకారంతో ఆరు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రోజుకు ఆరు గంటలు చొప్పున ఆరు రోజులుగా ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ ప్రోగ్రామ్‌పై 270 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల మాట్లాడుతూ పొందిన శిక్షణను సద్వినియోగం అయ్యేలా మీలోని నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకుని, మంచి ఉద్యోగాలను పొందాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాబోయే కాలంలో యూనివర్సిటీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఇంజినీర్ డాక్టర్ కె.నూకరత్నం, ట్రైనర్లు రజనీ, జీవన్, రాజ్యలక్ష్మి, చైతన్య, గౌతమ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థి హేమంత్ దుర్గను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ స్వామి తదితరులు

పెదపూడి: అనపర్తిలోని జీబీఆర్ జూనియర్ కాలేజీ విద్యార్థి వి.హేమంత్ దుర్గ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీఆర్ఎల్ స్వామి తెలిపారు. ఈ నెల 9,10 తేదీల్లో రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీలో జరిగిన 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తూర్పుగోదావరి జిల్లా జట్టు తరుపున ఉత్తమ ప్రదర్శన చేసి రాష్ట్రస్థాయి అండర్-17 బాల్ బ్యాండ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థిని కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి, యాజమాన్య ప్రతినిధి జి.రామారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్బాయిరెడ్డి, కళాశాల పీడీలు భినందించారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి

రంగంపేట: విద్యార్థులు నిర్దిష్ట ప్రణాళికలతో చదువులు సాగించి అనుకున్న లక్ష్యం సాధించాలని ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ విశ్రాంతి ఉద్యోగి పివిఎస్ ప్రసాదరావు అన్నారు. శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎస్.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడోరోజు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం, వికాసం పెంపొందుతుందని అన్నారు. గ్రంథాలయాధికారి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాసరచన పోటీలకు వివిధ స్కూళ్లు, కళాశాలల నుంచి 85 మంది విద్యార్థులు పాల్గొన్నారు.